నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, గురువారం 26 సెప్టెంబర్ 2024 | MAHABUBABAD

హామీలు నెరవేర్చే దాకా పోరాటం..

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఈ ప్రభుత్వంపై హామీలు నెరవేర్చ వరకు పోరాటం చేస్తామన్నారు. గతంలో ప్రతినెల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించే వాళ్లమని ఈసారి విస్తృత స్థాయి సమావేవం తెలంగాణలో భవన్ నిర్వహించామన్నారు. బీఆర్ఎస్ కుటుంబానికి యువనేత కేటీఆర్ స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. ఓరుగల్లు అభివృద్ధిలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్ర ప్రముఖమైందన్నారు. పార్టీ కార్యక్రమాలను ఇకపై ముమ్మరం చేస్తామని తెలిపారు. ఇప్పటికే పార్టీ కార్యాలయం వేదికగా అనేక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీని, కమిటీలను పునర్నిర్మిస్తామన్నారు. పార్టీకి కష్టకాలంలో అండగా ఉండే వారికి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడమని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ తొమ్మిది నెలల్లో జరిగిన అభివృద్ధిగా చూపిస్తున్నదని విమర్శించారు. రానున్న రోజుల్లో పార్టీని, సోషల్ మీడియాను బలోపేతం చేస్తూ ప్రజల్లో అనునిత్యం ఉంటూ ప్రజల తరపున పోరాడుతామని వినయ్‌భాస్కర్ అన్నారు.

- దాస్యం వినయ్ భాస్కర్

వినయన్న మంత్రి కావడం ఖాయం

'పేరులో వినయం.. వినయంతో భాస్కరుడు అంటే సూర్యుడు.. కేసీఆర్ తమ్ముడు.. మంచి మాస్‌లీడర్.. మా అన్న వినయ్‌భాస్కర్' అంటూ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భాస్కరుడు అని ఎందుకన్నానంటే.. అన్న సూర్యుడి లాంటివాడని, సూర్యుడు కూడా అప్పుడప్పుడు నల్లటి మబ్బుల మధ్యలో కొద్ది రోజులు కనిపించకుండా పోతాడు ఇప్పుడు వరంగల్ పశ్చిమలో సైతం అదే జరుగుతోంది. రానున్న రోజుల్లో ఉజ్వల భవిష్యత్తు ఉన్న వినయన్న మంత్రి కావడం ఖాయం. ఓరుగల్లు కేంద్రంగా ఉద్యమాన్ని నడిపిన ముఖ్య నాయకుడు దాస్యం వినయ్‌భాస్కర్' అని కేటీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో శాసనమండలి పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దివ్యాంగుల సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి తదితరులు

మాస్‌లీడర్.. ఫ్యూచర్ మినిస్టర్!

నిత్యం ప్రజల్లో ఉండే దాస్యం ఓడిపోవడం ఆశ్చర్యం కలిగించింది

చేసిన అభివృద్ధిని చెప్పకోలేకపోయాం

- ఓరుగల్లుకు పెద్ద హాస్పిటల్, ఐటీ కంపెనీలు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు తెచ్చుకున్నాం
- తప్పుడు ప్రచారం వల్ల యువతకు దూరమయ్యాం
- గాడిద ఉంటేనే గుర్రం విలువ తెలుస్తుంది
- మేం పూర్తిచేసిన పనులకు కాంగ్రెస్ ఎమ్మెల్యేల పూలాభిషేకాలు
- సర్కారు వైఫల్యాలను జనంలోకి తీసుకెళ్లాలి
- స్టేషన్ ఘన్‌పూర్ ఉప ఎన్నికలో బరాబర్ గెలిచేది మనమే
- పశ్చిమ నియోజకవర్గ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా : దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, సెప్టెంబర్ 25 : బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్ నిబద్ధత గల నాయకుడని, తెల్లారి లేస్తే ప్రజలకు అందుబాటులో ఉండే వినయ్ ఓడిపోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని కానీ భవిష్యత్తులో ఆయన మంత్రి కావడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వినయ్ ఓడిపోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని అయినా సరే ఈ ఓటమి కూడా మనకు మంచిదేనని గాడిద ఉంటేనే గుర్రం విలువ తెలుస్తుందన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని చెప్పుకోలేక పోయామని అన్నారు. ఇప్పుడు మనం సంధికాలంలో ఉన్నామని, 14ఏళ్లు ఉద్యమ పార్టీకి ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా కొట్లాడి, పోట్లాడి, ఢిల్లీ పెద్దలను ఒప్పించి, మెప్పించి తెలంగాణ సాధించుకున్నామని గుర్తుచేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించడం మనకు కొత్త అన్నారు. రాష్ట్రంలో చాలామంది మన వైపే చూస్తున్నారని ఈ సమయంలో పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు, శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణలోనే అతి పెద్ద హాస్పిటల్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, వరంగల్‌కు ఐటీ కంపెనీలను మనమే తెచ్చాం, అభివృద్ధి చేశామని చెప్పుకోలేకపోయామని పేర్కొన్నారు. మనం పూర్తి చేసిన కాల్వ విషయంలో సిగ్గులేకుండా ఇప్పటి ఎమ్మెల్యే పూలాభిషేకాలు చేయించుకుంటున్నాడని అన్నారు. దేశంలోనే అత్యధిక ఉద్యోగాలు ఇచ్చినప్పటికీ అవతల వారి మాటలు నమ్మి యువత మనకు దూరమైతే, తప్పుడు ప్రచారాల కారణంగా మనకు దగ్గరగా ఉన్న వర్గాలు సైతం దూరమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.. స్టేషన్‌ఘన్‌పూర్‌లో బరాబర్ ఉప ఎన్నిక వస్తదని, తప్పకుండా మనమే గెలుస్తాం అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తాటికొండ రాజయ్యను ఇప్పటికే కేసీఆర్ ప్రకటించారన్నారు.

పేదలకు అండగా నిలుద్దాం..

హైడ్రా అనే హైడ్రామా వరంగల్‌లో కూడా మొదలైతదని, పేదలైనా, పెద్దలైనా అందరికీ ఒకే విధంగా న్యాయం జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరంగల్‌లో నాయకులు, భూ కబ్జాలు చేసేవాళ్లు ఉన్నందున భూ కుంభకోణాలు జరుగుతాయని.. ఎక్కడైనా సరే మనం పేదవాళ్లకు అండగా నిలుద్దామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను కూడా అమలు అయ్యే వరకు వాళ్లను ఎండగడుదామని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వాసుదేవారెడ్డి, మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

వరంగల్ సిటీ ఎక్సెలెంట్

- దేశంలోని టాప్-5 నగరాల్లో చోటు
- గ్రేటర్‌ను వరించిన మరో జాతీయ అవార్డు
- నర్చరింగ్ నైబర్ హుడ్ చాలెంజ్ పోటీలో ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్

సర్టిఫికెట్ అందుకుంటున్న బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఏఈ కార్తీక్‌రెడ్డి

వరంగల్, సెప్టెంబర్ 25 : బల్దియాను మరో జాతీయ అవార్డు వరించింది. కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ మంత్రిత్వ శాఖ ద్వారా బల్దియాకు ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్ లభించింది. మూడేళ్లుగా నిర్వహిస్తున్న నర్చరింగ్ నైబర్ హుడ్ చాలెంజ్ పోటీల్లో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ టాప్-5లో చోటు దక్కించుకుంది. బెంగళూరు, ఇండోర్, జబల్పూర్, కొచ్చి నగరాల సరసన నిలిచింది. బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్‌ను బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఏఈ కార్తీక్‌రెడ్డి అందుకున్నారు.

ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్ రావడం సంతోషంగా ఉంది : మేయర్

వరంగల్ కార్పొరేషన్ ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్ అందుకోవడం సంతోషంగా ఉందని మేయర్ గుండు సుధారాణి తెలిపారు. నర్చరింగ్ నైబర్ హుండ్ చాలెంజ్‌లో భాగంగా నిధులు మంజూరు చేసి నిర్దేశిత సమయంలో పార్కులను నిర్మించాలని పోటీ పెట్టిందని తెలిపారు. ఎంహెచ్ నగర్‌లో 56 గంటల్లో చిట్టి పార్క్‌ను నిర్మించి బల్దియా రికార్డు నెలకొల్పిందని పేర్కొన్నారు. క్రిష్టియన్ కాలనీ, కరీమాబాద్ గుండు బావులు, శ్రీనగర్‌కాలనీల్లో సెన్సోరి పార్కులు, ఎల్‌పీ స్కూల్‌లో సైన్స్ పార్కు, అంబేద్కర్ కూడలిలో బుద్ధ ప్లాజాలు నిర్ధేశిత సమయంలో నిర్మించడంతో ఈ అవార్డు దక్కిందని తెలిపారు. ఇందుకు కృషి చేసిన కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులకు అభినందనలు తెలిపారు.

మన పోలీస్ భేష్

- ఉత్తమ సేవకు గాను పలువురికి అవార్డులు
- స్టేట్ బెస్ట్ ఎంక్వైరీ ఆఫీసర్‌గా శాయంపేట హెచ్‌సీ వెంకట్రామ్‌నాయక్
- ఆత్మకూరు సీఐ, చిల్పూరు, మానుకోట రూరల్ ఎస్సైలకు సైతం..

శాయంపేట : డీజీపీ చేతుల మీదుగా బెస్ట్ ఎంక్వైరీ అధికారిగా ప్రశంస అందుకుంటున్న హెచ్‌సీ వెంకట్రామ్‌నాయక్

సుబేదారి/మహబూబాబాద్ రూరల్/శాయంపేట, సెప్టెంబర్ 25 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసు శాఖ అందించిన ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ జితేందర్, అడిషనల్ డీజీపీ మహేశ్‌భగవత్ వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇందులో రాష్ట్రస్థాయి ఉత్తమ విచారణ అధికారిగా శాయంపేట స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామ్‌నాయక్ ఎంపిక య్యారు. బాధితుల నుంచి మర్యాదపూర్వకంగా ఫిర్యాదులు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం, థర్డ్ పార్టీకి సమాచారం అందించడంలో అతడి సేవలను గుర్తించి ప్రశంసాపత్రం అందజేశారు. 6 నెలల క్రితం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా చేతుల మీదుగా బెస్ట్ స్టేషన్ ఇన్‌చార్జి అవార్డునూ వెంకట్రామ్‌నాయక్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. అలాగే ఆత్మకూరు సీఐ సంతోష్, చిల్పూరు, మానుకోట రూరల్ ఎస్సైలు రాజేందర్, దీపిక బెస్ట్ అవార్డులు అందుకున్నారు.

ములుగు కలెక్టర్ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

డబ్బులు వసూలు చేసేందుకు సైబర్ నేరగాళ్ల యత్నం



ములుగు కలెక్టర్ పేరుతో వాట్సాప్‌లో పంపిన మెసేజ్

ములుగు రూరల్, సెప్టెంబర్25: ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్, వాట్సాప్‌లో నకిలీ ఖాతా సృష్టించి మోసపూరితమైన మెసేజ్‌లు పోస్టు చేసి పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసేందుకు యత్నిస్తున్నారు. తాను మీటింగ్‌లో ఉన్నానని, అర్జెంట్‌గా డబ్బులు కావాలంటూ +998886747021 ఉజ్బెకిస్తాన్ నంబర్ నుంచి సందేశాలను పంపి డబ్బులు ఫోన్‌పే చేసి స్క్రీన్‌షాట్ షేర్ చేయాలని పలువురికి మెసేజ్‌లు పంపించారు. అధికారుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన అసలు ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వవద్దని సూచించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సైబర్ నేరగాళ్లను పట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

ఆక్రమణలపై అఖిలపక్షం నిరసన

- భూమి కొనుగోలు చేశామని కొందరు..
- భారీ ఎత్తున మోహరించిన పోలీసులు
- ఇరు వర్గాల ముందస్తు అరెస్టు.. బయ్యారంలో ఉద్రిక్త

బయ్యారంలో అఖిలపక్ష నాయకులతో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

బయ్యారం సెప్టెంబర్ 24: గ్రామాభివృద్ధికి దాతలు ఇచ్చిన సీఎంసీ(చౌదరి మైనింగ్ కంపెనీ) స్థలం ఆక్రమణకు గురైందని అఖిలపక్షం నాయకులు నిరసన చేపట్టడంతో బయ్యారంలో ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి.. బస్టాండ్ సెంటర్‌లోని సర్వే నంబర్ 68లోని 1800 గజాల స్థల విషయంలో అఖిలపక్షం నాయకులు, ఆ భూమి కొనుగోలు చేసిన భూక్యా శ్రీరాం మధ్య ఏళ్లుగా వివాదం సాగుతోంది. ఈ క్రమంలో శ్రీరాం కోర్టును ఆశ్రయించి ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టాడు. ఈ క్రమంలో అఖిలపక్ష నాయకుల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. నిర్మాణాలను కూల్చివేసేందుకు యత్నిస్తున్నారని ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తే అవకాశముందని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 25 మంది అఖిల పక్షం నాయకులతోపాటు కొనుగోలు చేసిన శ్రీరాం, ఏసు, హరిరాంలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకుడు గౌని ఐలయ్య మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉన్న స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం విడ్డరంగా ఉందన్నారు. అక్రమ అరెస్టులపై బయ్యారం, గంధంపల్లిలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు నిరసన చేపట్టారు. కాగా, జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ బయ్యారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలు, స్థానిక పరిస్థితులను పర్యవేక్షించారు.

తిరగబడిన డబుల్ ఇళ్ల లబ్ధిదారులు

- బలవంతంగా ఖాళీ చేయించిన అధికారులు
- పెట్రోల్ పోసుకుని లబ్ధిదారుల ఆత్మహత్యా యత్నం

పాలకుర్తి మండలం ఎల్లరాయిని తొర్రూరు (జే)లో డబుల్ బెడ్ రూం ఇళ్లను ఖాళీ చేయిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 25: పాలకుర్తి మండలంలోని ఎల్లరాయిని తొర్రూరు జే గ్రామంలో బుధవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నుంచి లబ్ధిదారులను రెవెన్యూ, పోలీస్ అధికా రులు ఖాళీ చేయించేందుకు యత్నించగా తిరగబడ్డారు. ఈ క్రమంలో పసులాది అంజమ్మ, జోగు ఇందిర, గడ్డం భూలక్ష్మి పెట్రోల్ పోసుకొని అంటించుకునేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి..గత కేసీఆర్ ప్రభుత్వం పేదల కోసం 20 డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేసింది. పూర్తయిన వాటికి రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. పట్టా సర్టిఫికెట్లు మాత్రం ఇవ్వలేదు. ఈ క్రమంలో అధికారులకు సమాచారమివ్వకుండానే పది నెలల క్రితం లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు. బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సైలు సాయిప్రసన్నకుమార్, సృజన్ కుమార్, యాకూబ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో గృహాలను ఖాళీ చేయించారు. దీంతో కోపోద్రిక్తులైన లబ్ధిదారులు కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతోనే అధికారులు ఇళ్లు ఖాళీ చేయించారని, ఈ పాపమంతా వారిదేనని మండిపడ్డారు. అక్రమంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో డీఎస్ వెంకన్న హెచ్చరించారు. త్వరలో గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు.

కాంగ్రెస్ నాయకుల కుట్రలతోనే ఖాళీ చేయించిన్రు

కాంగ్రెస్ గ్రామ నాయకుల కుట్రతోనే ఇళ్లు ఖాళీ చేయించిన్రు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేదల కోసం కట్టించి ఇచ్చిన ఇళ్లు. ఆయన పొమ్మంటేనే పోయాం. గ్రామ సభ నిర్వహించి కూడా మమ్ముల్ని ఎంపిక చేసిన్రు. పెట్రోల్ పోసుకుని చస్తం. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, హనుమండ్ల ఝాన్సీ రెడ్డిలకు మా పేదల పాపం తగులుద్ది.

– పసులాది అంజమ్మ, లబ్ధిదారురాలు

మేడారం మినీ జాతరను విజయవంతం చేయాలి

- పనులు నాణ్యతతో చేపట్టాలి
- పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం : మంత్రి సీతక్క

ములుగులో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్, సెప్టెంబర్ 25 : మేడారం మినీ జాతరను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2025 చేపట్టే మినీ జాతర పనులు ప్రధాన జాతరకు ఉపయోగపడేలా పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. వందల కోట్లు వెచ్చించి మేడారంలో పనులు చేపడుతున్నా శాశ్వతంగా ఉండకపోవడం వల్ల తిరిగి అవే పనులు మళ్లీ చేపట్టాల్సి వస్తున్నదన్నారు. ఇప్పటి నుంచి చేపట్టే పనులు దీర్ఘకాలంగా ఉండేలా పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్ఫర్స్ పథకాన్ని ప్రవేశపెట్టిన దృష్ట్యా జాతరకు నిధులు వచ్చే అవకాశం ఉందని, ఆ నిధులతో గద్దెల చుట్టూ ఫ్లోరింగ్ చేయిచడంతో పాటు నిరంతరం మంచినీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తల్లులను దర్శించుకునే భక్తులకు వసతులు కల్పించే బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని తెలిపారు. గత జాతరలో పనిచేసిన అధికారుల సూచనలు పాటిస్తూ అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. 2024లో జరిగిన మేడారం మహా జాతర సందర్భంగా చేపట్టిన పనులకు నిలిచిపోయిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పనులు శాశ్వతంగా ఉండేలా అన్ని శాఖల అధికారులు చొరవ తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్‌జీ, మేడారం ఈవో రాజేందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మీ సేవకు వందనం

పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగిన అధికారులు

నెక్కొండలో పారిశుధ్య కార్మికురాలు ప్రమీల కాళ్లు కడుగుతున్న డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాందెడ్డి

నెక్కొండ, సెప్టెంబర్ 25: పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలకు అధికారులు గౌరవమిచ్చా రు. నెక్కొండలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో రాందెడ్డి కార్మికుల కాళ్లు కడిగి వారు గ్రామాల్లో చేస్తున్న సేవలను కొనియాడారు. నెక్కొండ, ముదిగొండకు చెందిన పారిశుధ్య కార్మికులు బస్కె శ్రీనివాస్, ఓరుగంటి ప్రమీలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో, జడ్పీ సీఈవో మాట్లాడుతూ నిత్యం గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని తొలగిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని రక్షించే పారిశుధ్య కార్మికులను మనమంతా గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనురాధ, ఎంపీడీవో దయాకర్, ఎంఈవో రత్నమాల, పంచాయతీ కార్యదర్శి సదానందం, ఎంపీవో సునీల్, ఏపీవో జాకబ్ పాల్గొన్నారు.

గంట్లకుంటలో పెన్షన్ల కోసం జీపీ ఎదుట నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

పింఛన్ల కోసం నిరీక్షణ

ఆగస్టు నెల డబ్బులు ఇప్పటికీ రాకపోవడంతో తిప్పలు

పెద్దవంగర, సెప్టెంబర్ 25 : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులు, కల్లు గీత, చేనేత కార్మికులు, ఇతరులకు అందిస్తున్న పింఛన్ల కోసం నిరీక్షిస్తున్నారు. సెప్టెంబర్ వచ్చినా ఆగస్టు నెల పింఛన్ ఇంకా రాకపోవడంతో పింఛన్‌దారులు అవస్థలు పడుతున్నారు. ప్రతి నెల మొదటి రోజునే పెన్షన్ అందేలా చూడాలని కోరుతున్నారు. ఆగస్టు నెల పింఛన్ డబ్బులు రావడంతో మండలంలోని గంట్లకుంట గ్రామంలో పెన్షన్‌దారులు గ్రామపంచాయతీ ఎదు ట పెన్షన్ ఐడీ పుస్తకాలతో బారులు తీరారు.

ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో నృత్యాలు చేస్తున్న కేఎంసీ విద్యార్థులు

సంప్రదాయ సంబురం

కేఎంసీలో ఉత్సాహంగా సాగుతున్న ఉత్కర్ష-2024

కాకతీయ మెడికల్ కళాశాలలో జరుగుతున్న ఉత్కర్ష-2024 వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం వందలాది మంది విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. భారతీయత ఉట్టిపడే వేషధారణతో, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ కిషన్ ప్రారంభించారు. - కరీమాబాద్, సెప్టెంబర్ 25